
ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోల్డెన్ జూబ్లీ భవనం

'గోల్డెన్ జూబ్లీ'.. ముహూర్తం ఖరారు

జేఎన్‌టీయూలో రూ.50 కోట్లతో నిర్మించిన భవన ప్రారంభం నేడే

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభానికి ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. వర్సిటీ ఏర్పాటై 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా రూ.50కోట్లతో గోల్డెన్ జూబ్లీ భవనాన్ని నిర్మించారు. గురువారం ఉదయం 9.15గంటలకు వైస్‌చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది అవుతున్నా ప్రారంభోత్సవానికి సరైన ముహూర్తం కుదరలేదు. ఒకట్రెండు సార్లు హడావుడిగా ఏర్పాట్లు చేసినా ముఖ్యఅతిథి రావడానికి వీలుపడకపోవడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. అయితే, ఒకవైపు విద్యార్థులకు తరగతులు, ల్యాబొరేటరీల కొరత ఏర్పడడం, మరోవైపు పరిశోధనలకు సరైన వసతి దొరకకపోవడంతో గోల్డెన్ జూబ్లీ భవనాన్ని త్వరగా అందుబాట్లోకి తేవాలని వర్సిటీ యాజమాన్యం భావించింది. ఎట్టకేలకు క్యాంపస్‌లోని అతిపెద్ద భవనం ప్రారంభానికి నోచుకోవడంతో 1.36లక్షల చదరపు అడుగుల స్పేస్ విద్యార్థులకు అందుబాట్లోకి రానుందని, సువిశాలమైన తరగతి గదులు, ల్యాబొరేటరీలు, ఇతర సదుపాయాలు తమకు చేరువ కానున్నాయని విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆచార్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీ హబ్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక స్థానం : మంత్రి

రాయదుర్గం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ హబ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, రాష్ట్రంలో ఐటీ రంగం మరింత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసి బీ2జీ బీ 2జీ రెవెన్యూ యాక్సిలరేటర్ ఐ కొలాబ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాల ద్వారా ఆవిష్కరణలను నడిపించడంలో ఐకొలాబ్ హబ్ ఫౌండేషన్ ఒక ముఖ్యమైన ముందడుగన్నారు. ప్రభుత్వ సేకరణ వ్యవస్థను నావిగేట్ చేయడంలో స్టార్టప్‌లు తరచుగా ఇబ్బంది పడుతుంటాయని, వైవిధ్యమైన పరిష్కారాలు అవసరమయ్యే భారీ మార్కెట్ ఇది అన్నారు. ఐకొలాబ్ వంటి కార్యక్రమాలు ఈ రంగంలో అభివృద్ధి చెందడానికి సరైన సాధనాలు, నైపుణ్యం నెట్‌వర్క్‌లను అందిస్తుందన్నారు. బీ 2జీ రెవెన్యూ యాక్సిలరేటర్ ఐ కొలాబ్ ఫౌండేషన్ చైర్మన్ ఎల్.శ్రీనాథ్‌రెడ్డితో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


విశ్వేశ్వరరావు పార్థీవ దేహంపై బీజేపీ జెండా కప్పుతున్న కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు

బందా విశ్వేశ్వరరావు అంతిమ యాత్రలో నేతలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు బందా విశ్వేశ్వరరావు మార్చి 31న తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. బుధవారం నిర్వహించిన అంతిమయాత్రలో బీజేపీ, జనసేన, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈఎస్‌ఐ శ్మశాన వాటికకు తీసుకెళ్లే ముందు విశ్వేశ్వరరావు పార్థీవ దేహంపై బీజేపీ జెండాను కప్పి ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతరావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనసేన పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ తదితరులు నివాళులర్పించారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మాయాదవ్

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఓల్డుబోయిన్‌పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీళ్ల కోసం అలమటించే వారి దాహార్తిని తీర్చేందుకు సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వేసవి పూర్తయ్యేంత వరకు చలివేంద్రాలు, మజ్జిగ, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ స్వచ్ఛంద సంస్థలకు పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం డివిజన్ పరిధిలోని కళింగ ఎన్‌క్లేవ్ హైటెన్షన్ లైన్‌లో స్కిన్ హెయిర్‌లెస్ క్లీనిక్ యం.డీ మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో టింకూ గౌడ్, మనీష్ చారి, కృష్ణచారి, శ్రావణి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్: వంశీరెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని వివేకాందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గొప్పలుపోతూ కేంద్రం అందించే విషయాన్ని ప్రజలకు తెలియకుండా చేస్తుందన్నారు. అదేవిధంగా హెచ్‌సీయూలో భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గోపాల్, రాజు పాల్గొన్నారు.

ఈ ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర

- అక్కన్న, మాదన్నలు నిర్మించిన సీతారామ ఆలయం
- సుమారు రూ.8 కోట్లతో దేవాలయ జీర్ణోద్ధారణ

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు


శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ గాలిగోపురం


ఆలయ పునర్ నిర్మాణానికి ముందు సీతారామచంద్రస్వామి ఆలయం (ఫైల్)

కూకట్‌పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో వెలిసిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయానికి 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. కుతుబ్‌ షాహీ నవాబు తానీషా పాలనలో మంత్రులుగా కొనసాగిన అక్కన, మాదన్నల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్రలో ఉంది. ఈ ఆలయంలో శ్రీ పట్టాభిరాముడు సీతాదేవి, లక్ష్మణుడు, భరతుడు, శత్రఘ్నుడు, ఆంజనేయస్వామి అందరూ ఒకే పీఠంపై దర్శనమిస్తున్నారు. శ్రీరాముడు విల్లంబు, ధనుర్బాణాలు ధరించకుండా భక్తులకు దర్శనమివ్వడం ఈ ఆలయంలో ప్రత్యేకత. భక్తులకు అభయమిచ్చేలా అభయహస్తం, కోర మీసాలతో స్వామివారు దర్శనమిస్తూ కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల నమ్మకం. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారామాలయంలో ఈ నెల 1 నుంచి అధ్యయనోత్సవాలు, 4 నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

కూకట్‌పల్లికి ప్రత్యేక స్థానం

కూకట్‌పల్లి గ్రామంలో బఖారి వంశస్థుడు శ్రీ లింగం బట్టు చిన్నతనంలోనే శ్రీరామమంత్రోపదేశం పొందారు. తన ఇంట్లో శ్రీరామ నవరాత్రులు జరపాలనుకోవడంతో ఆటంకాలు ఏర్పాడినాయి. దీంతో నిర్మల ప్రదేశంలో గుడిసె వేసి అందులోనే కలశం ఏర్పాటు చేసి దీక్ష ప్రారంభించగా ఎలాంటి ఇబ్బందులు రాకపోవడంతో అదే ప్రాంతంలో శ్రీరాముడికి గుడి కట్టాలని సంకల్పించారు. భగవంతుడి అనుగ్రహంతో అప్పుడే ఒకే పీఠంపై శ్రీ సీతారామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్ను, హనుమాన్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. భక్తుల సహకారంతో ఆలయ ముఖ మండపం నిర్మించారు. శ్రీరామనవమి వేడుకలు, శ్రీరామ కళ్యాణము ఆనాడే ఎంతో వైభవంగా నిర్వహించారు. గోల్కొండ సంస్థానంలో కులీకుతుబ్‌షాహీ వంశానికి చెందిన తానీషా పరిపాలనలో మంత్రులుగా కొనసాగిన అక్కన్న, మాదన్నలు ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. 1981లో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామివారు ఆలయన్ని సందర్శించారు. స్వామివారి అనుగ్రహం కలగాలంటే అమ్మవారు ఉండాలనీ 1983, ఏప్రిల్ 18న శ్రీ మహాలక్ష్మీ, గోదాదేవి ఆళ్వార్ విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి కోరిన కోర్కెలు తీర్చే పట్టాభి రామాలయంగా పేరుగాంచింది.

ఆలయ జీర్ణోద్దారణకు శ్రీకారం

పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుత ఎమ్మెల్యే కృష్ణారావు దేవాలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామ పెద్దలు, దేవాదాయ శాఖ, దాతల సహకారంతో నిధుల సేకరణ ముమ్మురం చేశారు. ఆలయానికి రాజగోపురం నిర్మించాలని 2017, జనవరి 4న పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ చినజీయర్‌స్వామి చేతుల మీదుగా 2019 జూన్ 27న దేవాలయ గర్భాలయ జీర్ణోద్దారణకు శంకుస్థాపన చేశారు. 2022 ఏప్రిల్ 25న శ్రీ సీతారామ, లక్ష్మణ, భరత, శత్రఘ్ను, హనుమత్ సేవిత పట్టాభిరామాచంద్రస్వామి, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ ఆళ్వార్ ఆండాళ్ సన్నిధుల విగ్రహ, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపాన త్రిదండి చిన జీయర్ స్వామి చేతులమీదుగా నిర్వహించారు. 2022 ఏప్రిల్ 26న సామ్రాజ్య పట్టాభిషేకం.. మొత్తం ఆరు రోజుల పాటు పునఃప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పునర్‌నిర్మాణానికి సుమారు రూ. 8కోట్లు దాతల సహకారంతో సేకరించి ఆలయం అభివృద్ధికి కృషిచేశారు.

6న సీతారామచంద్రస్వామి కల్యాణం



కూకట్‌పల్లి రామాలయంలో శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణం ఏప్రిల్ 6న, 7న సామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతుంది. ఏప్రిల్ 4నుంచి 13వరకు బ్రహోత్సవాలు. అందులో భాగంగా ఏప్రిల్ 5న గరుడ ప్రసాదం, సాయంత్రం ఎదుర్కోలు.. 6న ఉదయం 10.30ని..కు శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, ఏప్రిల్ 7న ఉదయం 11గంటలకు సామ్రాజ్య పట్టాభిషేకం, ఏప్రిల్ 9న లక్షపుష్పార్చన, ఏప్రిల్ 12 రథోత్సవం, ఏప్రిల్ 13న చక్రస్నానం, అష్టోత్తర శత కలశాభిషేకం, పూర్ణహుతి ఉంటుంది.

\- మాడభూషిన శ్రీనివాసాచార్యులు, శ్రీ సీతారామాలయ ప్రధాన అర్చకులు

ఏర్పాటు చేస్తున్నాం

శ్రీ సీతారామచంద్ర స్వామి శ్రీరామనవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తాం. టెంట్‌లు, నీటి వసతి, ఆలయంలో అలంకరణ, అన్నదానం, ఆలయంలో ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేస్తున్నాం.

\- ఆంజనేయులు, ఆలయ ఈవో

ఉచిత బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే

- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది కిలో మాత్రమే
- మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉగాది నుంచి సన్న బియ్యం అందిస్తామని చెప్పిన రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చేది కేవలం ఒక్క కిలో మాత్రమేనని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. బుధవారం బీజేపీ నాయకులు మూసాపేట డివిజన్‌లోని రేషన్‌దుకాణాల వద్దకు రేషన్ బియ్యం అందిస్తున్నది కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమేనని కరోనా కాలం నుంచి నేటి వరకు కుటుంబంలో ఉన్న ప్రతీ ఒక్కరికి 5 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రేషన్ దుకాణాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రేషన్ దుకాణల వద్ద స్లిప్‌లపై ఏమి రాసి ఉందో లబ్ధిదారులకు చదివి వినిపించారు.


మూసాపేట రేషన్ దుకాణాల వద్ద బీజేపీ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌తో బీజేపీ నాయకులు

హెచ్‌సీయూ భూములు కాపాడుకుందాం

హైదరాబాద్ సెంట్రల్ యూనవర్సిటీ భూములు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్పొరేటర్ మహేందర్ అన్నారు. పశుపక్షాదులు, ఎన్నోజీవరాశులకు ఉన్న హెచ్‌సీయూలో రాత్రికి రాత్రే బుల్డోజర్‌లు పెట్టి చెట్లను తొలగించడం దారుణమని మండిపడ్డారు. హిందూ పండుగలకు పర్యావరణంతో ముప్పు అంటూ చెప్పే సెక్యులర్‌లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. హెసీయూ భూములు అమ్ముకుంటే పర్యావరణానికి ఎంతో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. వీలైతే మొక్కలు నాటాలని కాంగ్రెస్ పాలకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు ఎర్రాస్వామి, రవిగౌడ్, శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఎలేందర్, శోభరాజన్, జానకి, తదితరులు పాల్గొన్నారు.



ఆటిజంపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బుధవారం కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్‌లోని కేటీఆర్ గ్రౌండ్‌లో బ్లూ రోజ్ బిహేవియర్ థెరపీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం డే నిర్వహించారు. పిల్లల సామర్థ్యాలను అంచనా వేసి సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శివాలయం కాలనీలో రోడ్డు వేయిస్తా

ఫతేనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ శివాలయం ఉన్న కాలనీలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ బుధవారం పర్యటించారు. గతంలో నిర్మాణం పూర్తి చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించిన ఆయన కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఎస్టిమేషన్ తయారు చేయాలని డివిజన్ ఏఈ రాధాకృష్ణకు సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, ప్రవీణ్, సురేందర్ పాల్గొన్నారు.


స్థానికుల నుంచి వినతిపత్రాన్ని తీసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

హెచ్‌సీయూ విద్యార్థులకు అండగా బీఆర్‌ఎస్

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో రోజురోజుకు కాలుష్యం పెరుగుతుందని ఒక వైపు కేంద్రం హెచ్చరిస్తున్నా, వాటిని కాంగ్రెస్ పాలకులు పెడచెవిన పెట్టి భూముల అమ్మకాలు చేపడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చుట్టుపక్కల ఇప్పటికే కాంక్రీట్ జంగల్‌గా మారిందని అక్కడి ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవాలంటే హెచ్‌సీయూ భూముల్లో ఉన్న చెట్లను కాపాడుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు పర్యావరణ, భూగర్భజలాల ఇబ్బందులు రావద్దనే మాజీ ముఖ్యమంత్రి హరితహారంతో హైదరాబాద్‌లో కోట్లాది మొక్కలు నాటించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడచిన 15 నెలలోనే లక్షాయాభైవేల కోట్లకు పైగా అప్పులు చేసి ప్రజలకు ఇచ్చిందేమి లేదన్నారు. హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషమని, విద్యార్థులకు బీఆర్‌ఎస్‌పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం


మాల నరేశ్ (ఫైల్)

బాలానగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. మహబూబ్‌నగర్ జిల్లా దామరగడ్డ గ్రామానికి చెందిన మాల నరేశ్(30), మంగమ్మ ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారు బతుకుదెరువు కోసం బాలానగర్ చరబండరాజూ కాలనీలో ఉంటున్నారు. నరేష్ లేబర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మార్చి 24 ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన నరేశ్ తిరిగి రాలేదు. అతడి సెల్‌ఫోన్ కూడా ఆఫ్‌లో ఉంది. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో భార్య మణెమ్మ బుధవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తన భర్త స్వర్ణ అనే మహిళతో కలిసివెళ్లినట్లు అనుమానం ఉన్నదని ఫిర్యాదులో తెలిపిందని, ఆమె వివరాలను కూడా సేకరిస్తున్నామని సీఐ నర్సింహ్మారాజు వివరించారు.

డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

- పోలీసులకు ఫిర్యాదు

బాలానగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధుల నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా బైక్‌లపై వచ్చిన గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని ఓ డ్రైవర్ బాలానగర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఫతేనగర్‌లో నివాసముండే సయ్యద్ ముస్తఫా(38) బాలానగర్ అమిత్ కెపాసిటర్స్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మార్చి 27న రాత్రి విధుల్లో భాగంగా ఆటో ట్రాలీలో తెచ్చిన మెటీరియల్‌ను కంపెనీలో అప్పగించేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో రెండు బైకులపై వేగంగా వచ్చిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి తన వాహనాన్ని ఢీ కొట్టి, ఇనుప రాడ్డుతో అద్దాన్ని కూడా పగులగొట్టారని తెలిపాడు. ఈ ఘటనలో డ్రైవర్ కుడి కంటికి, ఒంటిపై కూడా గాయాలయ్యాయి. దీంతో తనపై దాడిచేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని ముస్తఫా బుధవారం బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో. రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోట 15, వంకాయ 23, బెండకాయ 35, పచ్చి మిర్చి 40, బజ్జి మిర్చి 21, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజీ 10, బీన్స్ 75, క్యారెట్ 19, గోబి పువ్వు 18, దొండకాయ 35, చిక్కుడు కాయ 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 40, ఆలుగడ్డ 23, కీర 13, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 18, కంద 75, ఉల్లిగడ్డ 24, మామిడి కాయ 15-20, చామగడ్డ 40, చిలకడ దుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 60-70, పచ్చి బఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 95, కరివేపాకు 70, పల్లికాయ 50, పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ముగిసిన పది పరీక్షలు.. విద్యార్థుల కేరింతలు

కేపీహెచ్‌బీకాలనీ, హైదర్‌నగర్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి పరీక్ష కావడంతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. కేపీహెచ్‌బీలోని భాష్యం, రవీంద్ర భారతి స్కూల్స్ వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆ మార్గమంతా స్తంభించి పోయింది. మాధవరం నగర్‌లోని నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద కుమార్తెను ఆత్మీయంగా దగ్గరకు తీసుకుంటున్న తండ్రి. పరీక్ష ముగిసిన తర్వాత ముచ్చట్లు చెప్పుకోవడం కన్పించింది. కొన్ని సెంటర్ల వద్ద వారి టీచర్లు పరీక్ష ఎలా రాశారు అని వాకబు చేశారు.

కూకట్‌పల్లిలో

పది పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ పరీక్షాకేంద్రం నుంచి బయటకు వచ్చారు. తల్లిదండ్రులను ఆలింగనం చేసుకున్నారు. తమ తోటి విద్యార్థులతో కలిసి సందడి చేశారు. కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మండుటెండలో తమ పిల్లలకోసం తల్లిదండ్రులు పడిగాపులు కాశారు. బుధవారం 12.30లకు విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చారు.

బాలానగర్‌లో

బాలానగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసాయి. బుధవారం చివరి పరీక్ష కావడంతో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థుల్లో పరీక్షలు పూర్తవుతున్నాయనే ఆనందం కొట్టొచ్చినట్లు కనిపించింది. పరీక్ష పూర్తయిన తరువాత కొందరు విద్యార్థులు సెల్ఫీలు దిగితే మరికొందరు విద్యార్థులు బేకరీలు, జ్యూస్ సెంటర్ల వద్దకు వెళ్లి నచ్చిన జ్యూస్ తాగి సందడి చేశారు.




పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు


ఆఖరి పరీక్ష ముగియడంతో సెల్ఫీలు తీసుకుంటున్న విద్యార్థులు


పరీక్ష బాగా రాశావా..


కరచాలనం చేసుకుంటున్న విద్యార్థినులు

ఎండలో అగచాట్లు

- నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్న బస్ షెల్టర్లు
- ఎండలో నిలబడి ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

చందానగర్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): వ్యాపార, వాణిజ్య, బహుళ అంతస్తుల సముదాయాలకు బస్ షెల్టర్లు అడ్డు వస్తున్నాయని వాటిని అధికారులు నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలకు గురవుతున్నారు. రెండు దశాబ్ధాల నుంచి గంగారం ఆర్ఎస్ బ్రదర్స్ ముందు, ఎదురుగా ఉన్న బస్టాప్ షటర్ల వద్దకు వచ్చి వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు, నిత్యం విద్య, ఉద్యోగ, వ్యాపార పనుల నిమిత్తం వేల సంఖ్యలో ఈ బస్టాప్ నుంచే రాకపోకలు సాగించే వారు. అయితే వాటిని తొలగించడంతో ప్రయాణికులు ఎర్రటి ఎండలో రోడ్డు పైనే నిలబడి బస్సెక్కుతున్నారు. గతంలో పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి వ్యాపార సముదాయాలు అధికంగా ఉండేవి. నగర విస్తరణలో భాగంగా శేరిలింగంపల్లి, చందానగర్‌లలో వ్యాపార, వాణిజ్య బహుళ అంతస్తుల భవనాలు పెరిగాయి. రవాణా సౌకర్యం కూడా మెరుగుపడింది. అయితే ప్రజలకు వ్యాపార, వాణిజ్య, సముదాయలు కనిపించకపోవడంతో నష్టాలు వస్తాయనే ఉద్దేశ్యంతోనే వాటిని తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొలగించిన బస్టాప్‌ల స్థానంలోనే వాటిని తిరిగి ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.





బస్ షెల్టర్లు తీసివేయడంతో గంగారం ఆర్ఎస్ బ్రదర్స్ ముందు, గంగారం ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద ఎండలో నిలబడి ఉన్న ప్రయాణికులు

ఇబ్బందులు పడుతున్నాం



రెండేళ్ల నుంచి నిత్యం ఇక్కడి నుంచి చిక్కడపల్లికి ప్రయాణం చేస్తున్నా. బస్టాప్‌లో షెల్టర్లు ఉండేవి. వాటివల్ల వాన, ఎండ, చలి నుంచి రక్షణ లభించేంది. ప్రస్తుతం వాటిని తొలగించడంతో రోడ్డుపై ఎండలోనే నిల్చొని ప్రయాణం చేయాల్సివస్తుంది. బస్సు షల్టర్‌ను తిరిగి నిర్మించాలి.

- అరవింద్, పీఈటీ మాస్టర్, చిక్కడపల్లి

ఎండను భరించలేకపోతున్నాం



నిత్యం దీప్తిశ్రీనగర్ నుంచి చందానగర్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్నా. 20 సంవత్సరాలుగా ఇక్కడి నుంచి ప్రయాణం చేస్తున్నా. బాగానే ఉండేది. ఇటీవల గంగారం చౌరస్తావద్ద జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న బస్టాప్ షల్టర్లను తొలగించారు. దీంతో ఎండలో రోడ్డుపైనే నిల్చొని బస్సు ఎక్కుతున్నాం. చాలా ఇబ్బందిగా ఉంది.

- రవికుమార్, దీప్తిశ్రీనగర్



ఐ కొలాబ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు, తదితరులు

ఐటీ హబ్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక స్థానం

మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ హబ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, రాష్ట్రంలో ఐటీ రంగం మరింత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసి బీ2జీ బీ 2జీ రెవెన్యూ యాక్సిలరేటర్ ఐ కొలాబ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాల ద్వారా ఆవిష్కరణలను నడిపించడంలో ఐకొలాబ్ హబ్ ఫౌండేషన్ ఒక ముఖ్యమైన ముందడుగన్నారు. ప్రభుత్వ సేకరణ వ్యవస్థను నావిగేట్ చేయడంలో స్టార్టప్‌లు తరచుగా ఇబ్బంది పడుతుంటాయని, వైవిధ్యమైన పరిష్కారాలు అవసరమయ్యే భారీ మార్కెట్ ఇది అన్నారు. ఐకొలాబ్ వంటి కార్యక్రమాలు ఈ రంగంలో అభివృద్ధి చెందడానికి సరైన సాధనాలు, నైపుణ్యం నెట్‌వర్క్‌లను అందిస్తుందన్నారు. బీ 2జీ రెవెన్యూ యాక్సిలరేటర్ ఐ కొలాబ్ ఫౌండేషన్ చైర్మన్ ఎల్.శ్రీనాథ్‌రెడ్డితో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప కమిషనర్‌గా ప్రణీత బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రణీత

గచ్చిబౌలి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ఉపకమిషనర్ గా వి.ప్రణీత బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ముకుంద్‌రెడ్డి మార్చి31న పదవీ విరమణచేశారు. దీంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆమెను బదిలీ చేశారు. మొన్నటి వరకు జూబ్లీహిల్స్ సర్కిల్ ఉపకమిషనర్‌గా పని చేస్తున్న ఆమెను బదిలీచేయడంతో ముధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఆమె కూకట్‌పల్లి, గాజుల రామారం సర్కిళ్లల్లో పనిచేశారు. అనంతరం సర్కిల్ సిబ్బంది, కొండాపూర్ కార్పొరేటర్ శేఖ్ అమీద్ పటేల్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూల బోకే శాలువాతో సత్కరించారు.

కొండాపూర్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార తనిఖీల్లో భాగంగా జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం కొండాపూర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైటెక్స్‌లో ఉన్న సొడెక్సో ఇండియా సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సెంట్రల్ ప్రొటక్షన్ యూనిట్‌లో తనిఖీలు చేశారు. కిచెన్‌లో కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరింగ్ సరిగా లేదని, ఆహార వ్యర్థాలు, తడిగా ఉన్న నేల, ఆహార పదార్థాలను సీల్ చేయకుండా నిల్వ చేయడం, ప్యాకింగ్ డేట్ సరిగా లేని పనీర్, చిల్లర్‌లో నిల్వ ఉంచిన మాసం, ఆహారాన్ని ప్లాస్టిక్ బాక్స్‌ల్లో నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేస్తే శ్రమకు తగ్గ ఫలితం ఉంటుందని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ సమక్షంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ పటేల్‌కుంట పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రంగారెడ్డిజిల్లా అర్బన్ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్: వంశీరెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని వివేకాందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు సన్నబియ్యం పంచుతున్నామని హెచ్చులు పోతూ కేంద్ర ప్రభుత్వం అందించే విషయాన్ని ప్రజలకు తెలియకుండా చేస్తుందన్నారు. అదేవిధంగా హెచ్‌సీయూలో భూముల వేలంను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



రామనామ సంకీర్తన ఆలపిస్తున్న కళాకారులు

అలరించిన రామనామ సంకీర్తనలు

ఖైల్‌కాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంగీత కళాకారులు ఆలపించిన శ్రీరామనామస్మరణలు.. సంకీర్తనలు అలరించాయి. బెల్ ఎంఐజీ కాలనీలోని శ్రీరామాలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సంగీత ఉపాధ్యాయులు శిరీష శిష్య బృందంచే నామసంకీర్తన జరగగా, భక్తులు రామస్మరణలు చేశారు. ఉదయం మూలమూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. స్వామివారి కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీరామనవమి పర్వదినం వరకూ ప్రతీరోజు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండడంతో ఉత్సవాలను దేవాలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు.

విజయదుర్గా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

గచ్చిబౌలి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్ లోని శ్రీ విజయ దుర్గా దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవంను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమీప కాలనీలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా 'సన్న బియ్యం పథకం'

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



సమావేశంలో పాల్గొన్న ప్రజలు

చందానగర్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకం చరిత్రలో నిలిచిపోతుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. 'ప్రజాపాలన - ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం చందానగర్ మున్సిపల్ కార్యాలయంలోని అంబేద్కర్ కల్యాణ మండపంలో రంగారెడ్డి సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జపాల్, కార్పొరేటర్లు మంజులా రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నాన్నె శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, ఉపకమిషనర్ పి.మోహన్‌రెడ్డి, ఏఎస్ఓ పుల్లయ్యతో కలిసి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. దీంతో పేదల ప్రజల ఆత్మగౌరవం కూడా పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పేదల పక్షపాత ప్రభుత్వమని వారికోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని, సన్న బియ్యంను పేదలకు పంపిణీ చేయడం ఒక భాగమేనన్నారు. రేషన్ బియ్యం అవసరం లేనివారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తిరిగి ఇస్తే నాలుగు కుటుంబాలకు అండగా నిలిచిన వారవుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రూ.16.600 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మరో రూ.1000 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించుకొని ముందుకు వెళతామని పేర్కొన్నారు. చందానగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్‌ని త్వరలో ప్రారంభించుకుంటామని సూచించారు. అమీన్‌పూర్ రోడ్డు పునర్ నిర్మాణ పనులను కూడా చేపడుతామని అన్నారు. శేరిలింగంపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మిర్యాల రాఘవరావు, తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం ఇవ్వాలి: సింధూ



బియ్యాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

ఖైల్‌కాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికీ నాణ్యమైన సన్న బియ్యం అందచేయాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి పౌరసరఫరాల అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో గల పలు కాలనీలల్లో ప్రారంభమైన సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ దుకాణాలల్లో నాణ్యమైన బియాన్ని సక్రమంగా ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పంపిణీలో ఎటువంటి అవక తవకలకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.



సర్దార్ పాపన్నగౌడ్‌కి నివాళులు

కూకట్‌పల్లి పార్టీ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు జి.కృష్ణ, దావీద్ తదితరులు - హైదర్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

నేటి యువతకు స్ఫూర్తి సర్వాయి పాపన్న: ఆరెకపూడి

మియాపూర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): బహుజనులందరూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ త్యాగాన్ని పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్ 315వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మియాపూర్ ఆల్విన్‌కాలనీ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి శేరిలింగంపల్లి గౌడసంక్షేమ సంఘం సభ్యులు, ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహుజనులకు రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. గోల్కొండ కోటపై బహుజనుల జెండా ఎగురవేసి చక్రవర్తి అయిన తెలంగాణ మొదట పోరాడ యోధుడని కొనియాడారు. కేవలం 12మంది మిత్రులతో కలిసి 12వేల మంది సైన్యాన్ని తయారు చేసుకుని అప్పటి రాజులపై దండెత్తి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 21కోటలను జయించి అధికారాన్ని కూడా బహుజనులకు కట్టబెట్టిన గొప్పనాయకుడు పాపన్నగౌడ్ అన్నారు. ఒక సామాన్యమైన వ్యక్తి కోటలను వశపరుచుకోవడం గొప్ప విషయమన్నారు. గోల్కొండ కోటను 7నెలలు పరిపాలించి బహుజనుల సంస్కృతి, సంప్రదాయాలు గౌరవించేలా పరిపాలన సాగించారని తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు దొంతి లక్ష్మీనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి పుట్ట వినయ్‌కుమార్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు బాలింగ్ గౌతంగౌడ్, ప్రధాన కార్యదర్శి లీలానంద్‌గౌడ్, కోశాధికారి దాత్రినాథ్‌గౌడ్, అశోక్‌గౌడ్, యాదగిరిగౌడ్, రాచమల్ల నాగేశ్వర్‌గౌడ్, మూల అనీల్‌గౌడ్, ఏకాంత్‌గౌడ్, రాములు గౌడ్, వెంకటేష్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా ఆలయంలో పూజలు

గచ్చిబౌలి, ఏప్రిల్2 (ఆంధ్ర జ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆదర్శనగర్‌లోని విజయ దుర్గా భవాని అమ్మవారి బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయండి

గచ్చిబౌలిలోని శిల్పా లే అవుట్ సెకండ్ లెవల్ వంతెన నిర్మాణ పనులను చీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పెండింగ్ భూసేకరణ పూర్తిచేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

సాఫీగా రాకపోకలకు కృషి



రోడ్డుగుంతలను మరమ్మతులు చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్

హైదర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా మారిన గుంతలను కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జానయ్య ప్రత్యేక చొరవ తీసుకుని దగ్గరుండి మరమ్మతులు చేయించారు. కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫేజ్-7లోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్, నిజాంపేట రోడ్డులో ఉన్న రోడ్డుకు అంచుల వెంబడి గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బుధవారం ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి కాంక్రీట్‌తో గుంతలను పూడ్చి వేయించారు.

సౌజన్య ఆత్మహత్యకు కారణం భర్త, అత్త వేధింపులే

- కఠినంగా శిక్షించాలని మృతురాలి తల్లి ఫిర్యాదు

హైదర్‌నగర్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తపెట్టే వేధింపులు తాళలేక వివాహిత సౌజన్య బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. గురువారం హైదరాబాద్‌కు చేరుకున్న యువతి తల్లిదండ్రులు పోలీసులను కలిసి తమ కుమార్తె సౌజన్యను భర్త, అత్త చాలా ఇబ్బందులు పెట్టినట్లు తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం.. వరంగల్‌జిల్లా ఖానాపూర్‌కు చెందిన సౌజన్య (29)కి మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లికి చెందిన రజనీకాంత్‌రెడ్డితో 2020 డిసెంబర్‌లో రూ.16లక్షలు కట్నం ఇచ్చి వివాహం చేశారు. వివాహానికి ముందు సౌజన్య ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తుండగా రజనీకాంత్‌రెడ్డి ఉద్యోగం మానేయాలని చెప్పడంతో ఇంట్లోనే ఉంటోంది. పెళ్లయిన కొత్తలో ఎల్బీనగర్‌లో ఉండగా వివాహసమయంలో కట్నం, బంగారం సరిపోవడం లేదని ఏదో సాకు చూపుతూ నిత్యం సౌజన్యపై రజనీకాంత్‌రెడ్డి చేయి చేసుకునేవాడు. అతడి ప్రవర్తన మార్చుకోవాలని ఇరువురి తరపు బంధువులు, పెద్దల సమక్షంలో మందలించి సౌజన్యకు తోడుగా ఉండేందుకు ఆమె తరపు బంధువులు ఉన్న కేపీహెచ్‌బీ కాలనీకి షిఫ్ట్ చేయించారు. ఇక్కడికి వచ్చాక సైతం ప్రవర్తన మార్చుకోకుండా అలానే ప్రవర్తించే వాడు. వీరికి మూడేళ్ల బాబు ఉన్నాడు. రజనికాంత్‌రెడ్డి వేధింపులు భరించలేక మంగళవారం సౌజన్య ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్య చేసుకునేముందు తనను తన భర్త రజనీకాంత్‌రెడ్డి, అత్త మంజుల, మరిది శ్రీకాంత్‌లు ఏవిధంగా హింసించారు, తాను ఎందుకు ఆత్మహత్య చేసుకుంటుంది వివరిస్తూ మూడు పేజీల సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకుంది. ఆమె మృతికి కారకులైన భర్త, అత్త, మరిదిని కఠినంగా శిక్షించాలని మృతురాలితల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, కేపీహెచ్‌బీ సీఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా రజనీకాంత్‌రెడ్డి, మరిది శ్రీకాంత్ కేపీహెచ్‌బీ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఎండలు బాబోయ్..



గచ్చిబౌలిలో ఎండకు గొడుగులు పట్టుకొని వెళుతున్న విద్యార్థులు



హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ వద్ద కుండలు అమ్ముకునే చిరువ్యాపారి నీడకోసం గొడుగును ఆశ్రయించిన దృశ్యం



గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థుల ఆనందహేళి



దూలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



గాజులరామారం ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన పది పరీక్షలు..
విద్యార్థుల సందడి

జోన్‌బృందం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు బుధవారం పూర్తికావడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని పరీక్ష సెంటర్ల నుంచి బయటకు వస్తూనే వారి ముఖాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. వారిని తీసుకొని వెళ్ళేందుకు వచ్చిన తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పది పరీక్షలు అయిపోయాయన్న సంతోషం వారి ముఖాల్లో స్పష్టంగా కనిపించింది.

14 వరకు రాజీవ్ యువవికాసం గడువు పొడిగింపు

దుండిగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకాన్ని ఈ నెల 14 వరకు పొడిగించింది. అర్హులు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ అన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు మున్సిపాలిటీలోని రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై సమావేశం

జీడిమెట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు పారిశ్రామికవేత్తలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఈ నెల 3 సాయంత్రం 4 గంటలకు జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా బాలానగర్ డివిజన్ పోలీస్ ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంతను పూడ్చిన దృశ్యం

గుంతను పూడ్చిన అధికారులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాల్‌రెడ్డినగర్‌లో తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి గుంతను పూడ్చకుండా వదిలేయడంతో ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో తవ్వారు.. వదిలేశారు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. బుధవారం తవ్వి వదిలేసిన గుంతను పూడ్చారు. సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికకు స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



కుప్పలు తెప్పలుగా చెత్త ..పట్టించుకోని ఐలా అధికారులు అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామికవాడలో అధికారులు రోడ్డుపై చెత్తను మొత్తం శుభ్రం చేయించారు.

- పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి)



నిజాంపేట్ కార్పొరేషన్‌లో జైభీమ్ జైబాపు జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నిజాంపేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జై భీమ్ జై బాపు జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 7, 8, 9 డివిజన్లలో ఎన్ఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొని అందరితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, చేసిన అభివృద్ధి, అలాగే రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కో-ఆర్డినేటర్ ఉజ్మాషాకీర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నగేష్ చారి, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జంట సర్కిళ్లలో
శిథిలమైన మ్యాన్‌హోళ్లు, రోడ్లు

- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా కూలిపోయిన, కుంగిన మ్యాన్‌హోళ్లు, శిథిలమైన రోడ్లు దర్శనమిస్తున్నాయి. వెరసి ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు అటుగా వెళ్తే ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనంలేదని పలువురు వెల్లడిస్తున్నారు. సీసీ రోడ్లు వేయకున్నా ఫర్వాలేదు.. మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు అధికారులు, పాలకులను విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

- కుత్బుల్లాపూర్ సర్కిల్ బాల్‌రెడ్డినగర్ నుంచి పద్మానగర్ ఫేజ్-1 వెళ్లే రోడ్డు శిథిలమై కంకరతేలింది.
- సంజీవయ్యనగర్ పోచమ్మ దేవాలయం వద్ద రోడ్డంతా గుంతలుగా మారింది.
- వాజ్‌పాయినగర్ రోడ్డు నంబరు ఒకటి వద్ద వినాయక మండపం ఎదురుగా తాగునీటి పైప్‌లైన్ వేసి ప్యాచ్‌లు చేయకపోవడంతో శిథిలంగా మారింది.
- బాపునగర్ 5వ నంబర్ రోడ్డు శిథిలమై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.
- చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ 2వ నంబర్ రోడ్డులో మ్యాన్‌హోల్ లోపలికి కుంగిపోయింది. అదేవిధంగా 23వ నంబర్ రోడ్డులో మ్యాన్‌హోల్ పైకప్పు కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. పెంచల్‌రెడ్డి విగ్రహం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రోడ్డంతా శిథిలమై కంకర తేలింది.
- చంద్రానగర్ రోడ్ నంబర్ 9లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేసి ప్యాచ్‌లు చేయకపోవడంతో అటుగా వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పట్టించుకోవడం లేదు

భగత్‌సింగ్‌నగర్‌లోని అంతర్గత రహదారులన్నీ పూర్తిగా శిథిలమయ్యాయి. ఎక్కడ చూసినా కంకర తేలిన రోడ్లు, పగిలిపోయిన మ్యాన్‌హోళ్ల పైకప్పులు, కుంగిన మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. ప్రధానంగా చికెన్ మార్కెట్, బొడ్రాయి రోడ్లు వేసి సంవత్సరాలు అయింది. శిథిలమైనప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. ఆస్తి పన్నులను ముక్కు పిండి వసూలు చేసే అధికారులు మౌళిక సదుపాయాలను ఎందుకు సరిగా కల్పించరు. సమస్యలను పరిష్కరించకుంటే బస్తీ వాసులమంతా కలిసి ఆందోళన చేస్తాం.

- ఆదిత్య, భగత్‌సింగ్‌నగర్



భగత్‌సింగ్‌నగర్ 24వ రోడ్‌లో కుంగిపోయిన మ్యాన్‌హోల్



చంద్రానగర్‌లో ప్యాచ్ పనులు చేయని 9వ నంబర్ రోడ్డు

అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు కేటాయించొద్దు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని భూములను కబ్జా చేయాలనే ప్రయత్నం మానుకోవాలి. జీవ వైవిధ్యానికి ప్రతీకలైన అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం తగదని ఏబీవీపీ నాయకులు కుత్బుల్లాపూర్ ఐడీపీఎల్ చౌరస్తాలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఐడీపీఎల్ చౌరస్తాలో ఏబీవీపీ నాయకులు నిరసనను వ్యక్తం చేస్తుంటే బాలానగర్ పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏబీవీపీ మేడ్చల్ జిల్లా, చింతల్ షాపు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు మృత్యుంజయ మాట్లాడుతూ భావితరాలకు భవిష్యత్తు లేకుండా, ఎన్నో జీవరాశులకు గూడు లేకుండా చేస్తున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని అన్నారు.

గత ప్రభుత్వం హెచ్‌సీయూ చుట్టూ రింగ్ రోడ్డును తీసుకువస్తామంటే రేవంత్‌రెడ్డి వ్యతిరేకించారు. ఈ రోజున ఈ ఇందిరమ్మ స్థాపించిన హెచ్‌సీయూని నాశనం చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ నరేష్, భాగ్యనగర్ సంయుక్త కార్యదర్శి వివేక్, కొంపల్లి నగర సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, మహేష్, మనోజ్, దేవేందర్, నర్సింహ, విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు



మ్యాన్‌హోల్ సరిచేయరూ..

వెన్నెలగడ్డ నుంచి సుచిత్రాకు వెళ్లే రహదారిలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు నిర్వహించారు. కానీ మ్యాన్‌హోల్ చుట్టూ మట్టిని పూడ్చకుండా వదిలి వేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ చుట్టూ మట్టిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

- పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో పాల్గొన్న అతిథులు

కళాశాలలో ప్రారంభమైన సాంకేతిక, సాంస్కృతిక పోటీలు

నిజాంపేట్,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని బీవీఆర్ఐటీలో హైదరాబాద్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ సాంకేతిక సాంస్కృతిక మహోత్సవం సినర్జియా 2025 బుధవారం ప్రారంభమైంది. ఈ వేడుకల్లో జరిగిన వివిధ సాంకేతిక, సాంస్కృతిక పోటీలకు సుమారు 5 వందల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ కెవిఎస్ సునీత మాట్లాడుతూ తొలిసారి కళాశాలలో మూడురోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. నూతన సాంకేతికతలకు సంబంధించిన అనేక పోటీలు జరుగుతున్నాయని, ఈ పోటీలు విద్యార్థులు ఆలోచించేందుకు, విశ్లేషించేందుకు ప్రస్తుత ప్రపంచ సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనేందుకు సహాయపడతాయన్నారు. విద్యార్థులు ప్రతీ సమస్యను ఒక అవకాశంగా తీసుకొని, పరిష్కార మార్గాలు కనుగొనాలని డైరెక్టర్ విజయ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మొత్తం 35 ఈవెంట్లు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ మాలతీ, ప్రిన్సిపల్, కో-ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు

గాజులరామారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ చౌరస్తాలో ప్రధాన రోడ్డులో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లోకి ఇళ్ల నుంచి వెలువడిన నీరు చేరి దుర్వాసన వస్తుంది. వాహనదారులు రాకపోకలు సాగించేటప్పుడు రోడ్డుపైన గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నామని తెలుపుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

విష వాయువులతో విలవిల

జీడిమెట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని కెమికల్ కంపెనీలు విడుదల చేసిన విష వాయువులతో బుధవారం తెల్లవారుజామున 3 నుంచి 10 వరకు కుత్బుల్లాపూర్ ప్రజలు ఊపిరాడక విలవిలలాడిపోయారు. కొన్ని బస్తీలు, కాలనీలలో ప్రజలు వాయువుల ఘాటుతో వాంతులు చేసుకున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని కొన్ని రసాయన పరిశ్రమలు జనావాసాల మీదకు వదిలిన ప్రాణాంతకమైన వాయువులుగా స్థానికులు గుర్తించి, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజేందర్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఆయన సిబ్బందిని జీడిమెట్ల పారిశ్రామికవాడకు పంపించి ఇవి ఏ పరిశ్రమ నుంచి వస్తున్నాయో గుర్తించే పనిలో నిమగ్నమై ఉన్నారు. సంబంధిత పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



ఆటోలో చెత్త వేయవద్దని చెబుతున్న ఆటో డ్రైవర్

పాలకులు పరిష్కారం చూపాలి

- చెత్తను తరలించడంలో ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం

షాపూర్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే ఆటో డ్రైవర్‌లు చెత్తను తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్‌కాలనీ మొత్తం ఐదుఫేజ్‌లు ఉండగా దీనిలో హెచ్ఏఎల్‌కాలనీ, హెచ్ఏఎల్ ఈస్ట్‌కాలనీ, హెచ్ఏఎల్ వెస్ట్‌కాలనీ, ఫేజ్-4, ఫేజ్-5లుగా ఉన్నాయి. ఇందులో ఒక్కో కాలనీకి వేర్వేరుగా స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్తను తరలిస్తున్నారు.

చెత్త తరలించడానికి ప్రతినెలా ఇళ్ల యాజమాన్యం నుంచి రూ.100, 150 వసూలు చేస్తున్నారు. అయితే హెచ్ఏఎల్ ఈస్ట్‌కాలనీలో చెత్తను సేకరించే ఆటోడ్రైవర్ వారం రోజులనుంచి రాకపోవడంతో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చుట్టుపక్కల చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతోంది. పక్కన కాలనీలోని చెత్త తరలించే వ్యక్తి ఆటోలో వేయబోతే మీరు డబ్బులు ఇచ్చేవారి ఆటోలోనే వేయాలని కచ్చితంగా చెప్పడంతో చేసేదిలేక ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. ప్రజల్లో చైతన్యం రావాలి, అవగాహన పెరగాలి అని చెప్పే పాలకులు ఇలాంటి వాటికి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన పలు బస్తీల నాయకులు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నాం

దుండిగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై పలు కాలనీల వాసులు ఆయనను బుధవారం కలిసి సమస్యలను వివరించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్సీ పలు శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బస్తీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డుపైనే బోరు వేస్తున్న దృశ్యం

రోడ్డుపైనే బోరు తవ్వకం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో రోడ్లపైనే బోర్లను వేస్తున్నారు. మారుతినగర్‌లో ఓ వ్యక్తి తన ఇంటి స్థలంలో సెట్‌బ్యాక్‌లు వదలకుండా గతంలో ఇంటి నిర్మాణం చేపట్టారని, ప్రస్తుతం నీటి ఎద్దడి ఉండడంతో సీసీ రోడ్డుపైనే బోరు వేయిస్తున్నాడని స్థానికులు తెలుపుతున్నారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుని పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



కుంగిపోయిన పైప్‌లైన్ పైకప్పు

పొంచి ఉన్న ప్రమాదం.. మరమ్మతులు అవసరం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి ఐడీపీఎల్ చౌరస్తాలో తాగునీటి పైప్‌లైన్ వాల్వ్‌పై ఉన్న పైకప్పు కుంగిపోయింది. నీటిని విడుదల చేసే సమయంలో గుంతలో నిలుస్తోంది. బాలానగర్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే ప్రధాన మూల మలుపు ఇదే. నిత్యం వందలసంఖ్యలో వాహనాల రాకపోకల వల్ల కుంగిపోయిందని, మరమ్మతులు చేయకుంటే వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని పలువురు సూచిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ యువకుడు ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాపూర్‌నగర్ ప్రాంతం సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన ఎం.డీ.ఇమ్రాన్ పాషా(27) పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ప్రేమ విఫలం కావడంతో కొంత కాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ నెల 1న రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.